క్లుప్తంగా

ఘనంగా వనువులమ్మ తల్లి తీర్థం



వనువులమ్మను దర్శించుకుంటున్న నాయకులు

అమలాపురం రూరల్: మండలంలోని తాండవపల్లి పరిధి శెట్టిపల్లి గ్రామదేవత వనువులమ్మ తల్లి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. వనువులమ్మను దర్శించుకునేందుకు తాండవపల్లి, చిందాడగరువు, కామనగరువు, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు, గూడాల, రంగాపురం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, తాండవపల్లి, సమనస సర్పంచ్‌లు గంగుమళ్ల ఏసుబాబు, పరమట శ్యామ్ కుమార్, ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పరమట శరత్ బాబు, మాజీ ఎంపీటీసీ కైరం సత్తిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు గుమ్మళ్ళ దొరబాబు, రంకిరెడ్డి శ్రీను, కైరం రాము, కైరం వెంకటరత్నం తీర్థ మహోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. తాలూకా ఎస్‌ఐ పరదేశి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అసోసియేట్ డైరెక్టర్ విక్రమ్‌కు సత్కారం



అసోసియేట్ డైరెక్టర్ విక్రమ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, ప్రవీణ్

అమలాపురం టౌన్: హీరో ప్రభాస్ నటిస్తున్న రాజాసాబ్ చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ముషిణి విక్రమ్‌ను రాయుడు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రమూర్తి, కోనసీమ జేఏసీ నాయకుడు కరాటం ప్రవీణ్ తదితరులు బుధవారం పట్టణంలోని ఆయన ఇంటికెళ్లి సత్కరించారు. విక్రమ్ పలు చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసినా జాతీయ స్థాయి నటుడు ప్రభాస్ సినిమాకు పనిచేయడం అభినందనీయమన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై హర్షం

అమలాపురం టౌన్: విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై అమలాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ స్మృతి వనం నిర్మాణంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై ఉన్న అభిమానం తేటతెల్లమవుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్, కోనసీమ జిల్లా దళిత ఐక్య వేదిక కార్య నిర్వాహక కార్యదర్శులు మెండు రమేష్‌బాబు, ఉండ్రు బాబ్జి, మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్ తదితరులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలకు రెండు రోజుల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్వహించే అభివృద్ధి పనులపై శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో ప్రజల అభివృద్ధి సూచిక, సుస్థిర లక్ష్యాలను సాధించడంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి లక్ష్మణరావు, ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎంఈఓ కిరణ్‌బాబు, ఈఓపీఆర్‌డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, ఎంపీటీసీలు ఎస్.మౌనిక, పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి, కర్రి సత్య, సర్పంచ్‌లు దాకారపు చిరంజీవి, విష్ణు పాల్గొన్నారు.

రథానికి సంప్రోక్షణ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వచ్చేనెల 20న స్వామి కల్యాణోత్సవం సందర్భంగా స్వామి రథానికి బుధవారం సంప్రోక్షణ చేశారు. ఆలయ పండితులు నిర్ణయించిన ప్రకారం ఉదయం 10.23 నిమిషాలకు స్వామివారి రథానికి సంప్రోక్షణ చేసి వేద మంత్రోచ్చారణల నడుమ బాజా భజంత్రీలతో శాస్త్రోక్తంగా రథాన్ని బయటకు తీశారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, భక్తులు పాల్గొన్నారు.

నత్తనడకన వరి నాట్లు

- నియోజకవర్గంలో ఇప్పటివరకూ 10 శాతమే
- మిచాంగ్ తుపాను కారణంగా రబీ జాప్యం



వన్నెచింతలపూడిలో వరి నాట్లు వేస్తున్న కూలీలు



కామనగరువులో డ్రమ్ సీడర్‌తో నాట్లు వేస్తున్న రైతు

అమలాపురం రూరల్/ఉప్పలగుప్తం: మిచాంగ్ తుపాను కారణంగా ఖరీఫ్ మసూళ్ల ఆలస్యం కావడంతో పాటు కొన్నిచోట్ల రబీ కోసం వేసిన నారు మడులు దెబ్బతినడంతో రైతు మళ్లీ నారుమడులు వేసుకోవాల్సి వచ్చింది. దీనివల్ల ఈ ఏడాది రబీ సాగుకు తీవ్ర జాప్యమేర్పడింది. డిసెంబరు 15 నాటికే రబీ కోసం నాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నా నియోజకవర్గంలో ఇప్పటివరకూ 10 శాతమే నాట్లు పడ్డాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో నారు సిద్ధంగా ఉన్నా డ్రమ్ సీడర్ ద్వారా నాటుకుంటే మంచిదంటున్నారు.

రెండోసారి నారుమడులు

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో 16,000 ఎకరాల్లో రబీ వరి సాగు జరగాల్సి ఉంది. ఇప్పటివరకూ కేవలం 1000 ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. ఇంకా సుమారు 15 వేల ఎకరాల్లో నాట్లు పడాల్సి ఉంది. మిచాంగ్ తుపాను కారణంగా అనేక గ్రామాల్లో పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న ఖరీఫ్ పంట నీట మునగడం, నేలవాలిపోవడం, కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడం తదితర కారణాలతో మసూళ్లకు తీవ్ర జాప్యమేర్పడింది. మరోవైపు అప్పటికే నూర్పిడులు పూర్తి చేసుకుని రబీ కోసం వేసుకున్న నారుమడులు సైతం అనేకచోట్ల దెబ్బతినడంతో మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి నారుమడులు వేయాల్సి వచ్చింది. మరోవైపు సంక్రాంతి పండగ నేపథ్యంలో దాదాపు వారం రోజుల పాటు కూలీలు దొరక్క పనులు నిలిచిపోయాయి. వాస్తవానికి నారుమడులు పోసుకున్నాక 22 రోజుల నుంచి 25 రోజుల తరువాత నాటుతారు. అయితే చాలామంది రైతులు జనవరిలో నారుమడులు పోసుకోవడం వల్ల నెలాఖరుకి తప్ప నాట్లు పడే పరిస్థితి లేదు. మరోవైపు మార్చి 31 వరకూ మాత్రమే పంట కాలువల ద్వారా నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించడంతో రబీ సాగుపై ఆందోళన నెలకొంది.

డ్రమ్ సీడర్‌తో నాట్లు మేలు

రబీ కోసం రెండుసార్లు నారుమడులు వేసుకోవడం వల్ల ఖర్చు పెరిగిపోయిందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రబీ సాగులో డ్రమ్ సీడర్‌తో నాట్లు వేసుకుంటే ఖర్చు తగ్గుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కూలీలతో నాట్లు వేస్తే ఎకరానికి రూ.7,000 వరకూ ఖర్చవుతుందని, అదే డ్రమ్ సీడర్‌తో చేస్తే రూ.4,000 మాత్రమే ఖర్చవుతుందంటున్నారు. పైగా డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తే ఎకరానికి 6 బస్తాలపైనే దిగుబడి పెరగడంతో పాటు పంట 10 రోజుల నుంచి 12 రోజుల ముందుగానే కోతకు వస్తుందంటున్నారు. ప్రస్తుతం అమలాపురం మండలంలోని నడిపూడి, జనుపల్లి, వన్నెచింతలపూడి తదితర గ్రామాల్లో డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేస్తున్నారు.

> **రబీ నాట్లు త్వరగా పూర్తిచేయాలి**
>
> మిచాంగ్ తుఫాను కారణంగా ఈ ఏడాది రబీ సాగులో తీవ్ర జాప్యం జరిగింది. రైతులు వీలైనంత త్వరగా రబీ నాట్లు పూర్తి చేయాలి. నారుమడి వేసిన 22 నుంచి 24 రోజుల్లో నాట్లు నిర్వహించుకోవాలి. డ్రమ్‌సీడర్‌తో నాట్లు వేసుకుంటే ఖర్చు తగ్గుతుంది.
>
> – కడలి ధర్మప్రసాద్, ఏఓ, అమలాపురం

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి



తాళ్లరేవులో జీపీడీపీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ భైరవమూర్తి

తాళ్లరేవు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.అనుపమ అధ్యక్షతన రెండు రోజుల పాటు నిర్వహించే జీపీడీపీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఏఓ చింతా మోహన్‌కృష్ణలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల క్రికెట్‌లో ద్రాక్షారామ ముందంజ



కాపవరం జట్టుపై గెలుపొందిన ద్రాక్షారామ క్రికెట్ జట్టు

రామచంద్రపురం రూరల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో మహిళల క్రికెట్‌లో ద్రాక్షారామ జట్టు ముందంజలో ఉంది. బుధవారం జరిగిన ద్రాక్షారామ, కాపవరం సచివాలయాల క్రికెట్ పోటీల్లో ద్రాక్షారామ జట్టు విజయం సాధించి ముందంజలో ఉంది. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు సచివాలయ స్థాయిలో హోరాహోరీగా సాగుతున్నాయి. ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి పలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామోపాధ్యాయులు గెడ్డం అనునాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, ఎన్.సత్యనారాయణ, ఎన్.మల్లేశ్వరి, స్వాతి, సచివాలయ ఉద్యోగులు పంచాయతీ సిబ్బంది పోటీలను పర్యవేక్షిస్తున్నారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబాజీపేట ప్రభల తీర్థం



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలు



అంబాజీపేట సెంటర్‌లో కొలువుదీరిన ప్రభలను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా ముక్కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) బుధవారం ఘనంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పుర వీధుల్లో గొడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. సీఐ డి.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువురిని అలరించాయి.

పండగలు ఐకమత్యానికి ప్రతీక

అంబాజీపేట: పండగలు ఐకమత్యానికి ప్రతీకలని, మానవులు కలసిమెలసి జీవించేందుకు దోహదపడతాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గొడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుదీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అయినవిల్లి ఎస్సై సురేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువురిని అలంరిచాయి. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ ప్రభల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ హిందువుల అతి పెద్ద పండగ సంక్రాంతి పర్వదినం ఎంతో పాశస్త్యాన్ని కూడుకుందన్నారు. అడ్డగళ్ల వెంకట సాయిరామ్, మట్టపర్తి హరి, కొక్కిరి రవికుమార్, కల్వకొలను తాతాజీ, అడ్డగళ్ల శ్రీను, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు దర్శించుకున్న వారిలో ఉన్నారు.

వైభవంగా గ్రామ దేవతల తీర్థాలు



పెదపళ్లలో ప్రభలను భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. పెదపళ్లలో వేంచేసిన పోలేరమ్మ, చొప్పెల్లలోని దానాలమ్మ, గుమ్మిలేరులో వేంచేసిన గ్రామ దేవతలు ఉరదాలమ్మ, దండు గంగమ్మ అమ్మవార్ల జాతర, తీర్థ మహోత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామ ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు తిలకించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామ మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్‌లంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉరదాలమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన జాతర భక్తులను మంత్రముగ్ధులను చేసింది. గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, సన్నాయి, బ్యాండు మేళాలు, తీన్‌మార్ కార్యక్రమాలతో గ్రామంలో సందడి నెలకొంది.

కారులో చెలరేగిన మంటలు



రామచంద్రపురంలో కారు నుంచి వస్తున్న మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రామచంద్రపురం: పట్టణ ప్రధాన రహదారి ముబారక్ హోటల్ ఎదురుగా మారుతీ 800 కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న కారులోని కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. విద్యుత్‌నగర్‌కు చెందిన రాంబాబు ఇద్దరు పిల్లలతో కారులో వెళ్తుండగా ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. గమనించిన రాంబాబు పిల్లలతో సహా తాను ఏటీఎం నుంచి డ్రా చేసుకున్న రూ.లక్ష నగదుతో పాటు బయటకు వచ్చేశారు. మంటలను పట్టణ ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. ప్రధాన రహదారిలో రాత్రివేళ ఘటన జరగడంతో ట్రాక్ జామ్ అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. జీవనగమనంలో వృత్తివ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలలోనే బుధవారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ చిన్ననాటి అల్లరిని, తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు మోటూరి సుబ్రహ్మణ్యం, ఆకుల నాగేశ్వరరావు, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, అంబటి సత్యనారాయణ, నిమ్మకాయల స్వామినాయుడు, రంగమణి, కొమ్ముల సత్యనారాయణ, పల్లయ్య శర్మ, సలాది వెంకటేశ్వర్లు, మేడిది వేణులను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి కృషి చేసిన పూర్వ విద్యార్థులు నడింపల్లి వాసురాజు, చిక్కం వీర వెంకట భీమేశ్వరరావు, మద్దిశెట్టి సురేష్, నిమ్మకాయల కన్నా, గనిశెట్టి సునీత, కాట్రు రాజనాగేంద్ర, మన్నే సూర్యచంద్రరావు, చీకట్ల వెంకయ్యనాయుడులను వారి స్నేహితులు, గురువులు అభినందించారు.

అమలాపురంలో..

అమలాపురం టౌన్: స్థానిక పరంజ్యోతి కళాశాలలో 1996–98 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ కలయిక ఏర్పాటుచేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను సత్కరించుకున్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో పూర్వ విద్యార్థుల చిరునామాలు సేకరించి వేడుక ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విళ్ల పల్లంరాజు, న్యాయవాది వెంకరాల భాస్కరశాస్త్రి, ఫిజికల్ డైరెక్టర్ తోట రవి, పొన్నాడకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పడవ పందేలు

ఆత్రేయపురం: గ్రామంలో జరిగిన సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ రాష్ట్రస్థాయి పడవల, ఈత పోటీలు బుధవారం ముగిశాయి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి చొరవతో చిర్ల యూత్ ఫోర్సు, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సెక్రటరీ ప్రకాష్ నిర్వహణ సారథ్యంలో మూడు రోజుల పాటు జరిగాయి. ఈ పడవలు, ఈతల పోటీలను ప్రజలు ఆనందోత్సాహాలతో వీక్షించారు. పడవల పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.లక్ష, రెండో స్థానం సాధించిన ఆత్రేయపురం, రావులపాలెం టీమ్ రూ.50 వేలు, మూడో స్థానం సాధించిన ఎన్టీఆర్ కృష్ణా జిల్లా టీమ్‌కు రూ.30 వేలు, ఈతల పోటీల్లో ప్రథమస్థానం సాధించిన ఎం.దొరబాబుకు రూ.10 వేలు, రెండోస్థానం సాధించిన ఎం.ప్రకాష్‌కు రూ.7 వేలు, మూడోస్థానం సాధించిన కామేషబాబుకు రూ.3 వేలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. వినూత్నమైన ఈ పడవ పోటీలను మన ప్రాంతానికి పరిచయం చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన పండగ

- మూగబోయిన పల్లెలు
- గ్రామాల్లో ముగిసిన హరినామ సంకీర్తనలు
- తిరుగుపయనమైన హరిదాసులు



కొత్తపేటలో హరిదాసుకు స్వయంపాకం అందిస్తున్న భక్తులు

కొత్తపేట: పండుగ ముగిసింది.. సందడి ఆగిపోయింది.. పిల్లల కేరింతలతో కళకళలాడిన పల్లెలు మూగపోయాయి.. హరిదాసుల సంకీర్తనలు ఆగిపోయాయి.. పల్లెలకు వచ్చిన వారు పట్టణాలకు తిరుగు ప్రయాణమవుతుండగా వారి తల్లిదండ్రులు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు కొండంత బాధతో వీడ్కోలు చెప్పారు. సెలవులు ముగించుకుని పట్టణాలకు బయలుదేరిన విద్యార్థులు ఏదో కోల్పోయిన భావనతో పల్లెలకు టాటా చెప్పారు.

శ్రీమద్రమా రమణ గోవిందో హరి...

ధనుర్మాసం నెల రోజుల పాటు గ్రామాల్లో వినిపించిన హరినామ సంకీర్తనలు ముక్కనుమతో ముగిశాయి. గత నెల 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల్లో నివసించే హరిదాసులు తమకు కేటాయించిన గ్రామాల్లో ధనుర్మాసం రాకకు ప్రతీకగా శ్రీమద్రమా రమణ గోవిందో హరి... అంటూ హరినామ కీర్తనలతో గ్రామాల్లో ప్రవేశించారు. తలపై అక్షయపాత్ర, మెడలో పూలదండ, పట్టు పీతాంబరాలు, నుదుట నామాలు ధరించి, ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబుర పట్టి, కాళ్లకు గజ్జెలు, కమ్మని కంఠస్వరంతో విష్ణునామ స్మరణతో తెల్లవారుజాము నుంచే క్రమం తప్పకుండా వీధుల్లో దర్శనమిచ్చారు. ధనుర్మాసం ముగియడంతో మంగళవారం హరిదాసుల హరినామ సంకీర్తనలు వినిపించలేదు. అయితే గ్రామాలు, వీధుల్లో దర్శనమిచ్చారు. తలపై అక్షయపాత్ర లేదు, తంబుర, చిడతలు చేతిలో లేవు. వారి రాకను గుర్తించిన భక్తులు ముఖ్యంగా మహిళలు ప్రతీ రోజు మాదిరిగా అక్షయపాత్రలో పోసే స్వయంపాకంతో పాటు సంక్రాంతి పిండివంటలు, నగదు, బహుమతులు సమర్పించారు. సంక్రాంతితో మా హరినామ సంకీర్తన ముగిసింది.. ఆ శ్రీహరి ఆశీర్వదిస్తే మళ్లీ వచ్చే ధనుర్మాసానికి వస్తానమ్మా.. అంటూ గ్రామస్తుల వద్ద సెలవు తీసుకున్నారు. ఆ సందర్భంగా హరిదాసులకు వీడ్కోలు పలికారు. పలువురు నూతన వస్త్రాలతో సత్కరించి సాగనంపారు.

రథం ముగ్గుతో రంగవల్లులకు వీడ్కోలు

మకర సంక్రమణంతో ధనుర్మాసం ముగిసింది. ఆ ధనుర్మాసం అన్ని రోజులు వివిధ రకాల రంగవల్లులతో కళకళలాడిన వాకిళ్లు ధనుర్మాసాన్ని సాగనంపడానికి ప్రతీకగా రథం ముగ్గు వేస్తారు. నవరాత్రులు అనంతరం విగ్రహాలను సాగనంపి నిమజ్జనం చేసినట్టుగా ముగ్గులను ముగ్గుతోనే సాగనంపుతారు. అలా ముక్కనుమ నాడు (నాలుగో రోజు) బుధవారం సూర్యోదయానికి ముందే వాకిట్లో రథం ముగ్గు వేసి వీధిలో వేసిన భోగి మంటకు కలిపారు.

వైభవంగా వృక్షారామం వార్షికోత్సవం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరులోని శ్రీసత్య లక్ష్మణ దేవతా వృక్షారామం 8వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వృక్షారామం వ్యవస్థాపకుడు, ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, అధిక సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మానవులకు, మొక్కలకు ఉన్న అవినాభావ సంబంధాన్ని చాటి చెబుతూ దేవతా వక్షారామాన్ని నెలకొల్పడం అభినందనీయమన్నారు. బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టిన రోజున తమ జన్మ నక్షత్రానికి సంబంధించిన మొక్కకు పూజలు నిర్వహించడం ద్వారా దైవానుగ్రహం పొందాలన్నారు. సప్తఋషులు, నవగ్రహాలు, నక్షత్రాలకు సంబంధించిన మొక్కలకు పూజలు నిర్వహించారు. సత్తి రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వీరరాఘవరెడ్డి, లక్ష్మణరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, నల్లమిల్లి సతీష్, తాడి కోదండరామారెడ్డి, కోనాల సత్తిరెడ్డి పాల్గొన్నారు.